గతి తప్పిన కరుణ

శేషగిరి గురించి మీకు చెప్పాలని చాలాకాలంగా అనుకుంటున్నాను. ఐతే, బుచ్చిబాబు అన్నట్టు కొన్ని కథలకి తల కనిపిస్తూవుంటుందికానీ, తోక అంత తొందరగా దొరకదు.

శేషగిరీ అలాగే తప్పించుకుంటూపోయాడు, ఇన్నేళ్లూ.

ఇప్పుడు అతనితోకని నేనే కాకుండా చాలామంది దొరకపుచ్చుకున్నారు. అసలు శేషగిరిని నాకుపరిచయం చేసింది సూరి.

మణీహోటల్లో కాఫీతాగి బయటికొచ్చి సెంటర్‌లో నిలబడ్డాం-నేనూ, సూరీ అక్కడికి సాయంత్రాల్లో - శాస్త్రి, జానకిరామ్, ఆదిశేషయ్య, సుబ్బారెడ్డీ - మా మిత్రబృందమంతా చేరతారు.

గతంలో ఈ సెంటరెలా వుండేదో వివరిస్తున్నాడు సూరి. గాంధీగారి విగ్రహంవున్నచోట ఏడు వీధి కుళాయిలు ఉండేవట. ఆ పక్కగా పాడుబడిన బురుజు, వో వైపు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, దానివెనగ్గా నవాబుకోట - ఏవో వివరాలు చెప్తున్నాడు సూరి.

సరిగ్గా ఆ సమయంలో మా పక్కగావచ్చి నిలబడ్డాడు...శేషగిరి. సూరి పరిచయం చేశాడు.

ఐదడుగులలోపు ఎత్తు, దానికి తగ్గ వొడ్డు, ఒకకాలు కొంచెంపొడుగేమో అనిపించేటట్లు నిలబడేతీరు, జిడ్డుకారుతున్న మొహం, ఏటి ఒడ్డున రెల్లులా బట్టతలకి అటూఇటూ నాలుగు వెంట్రుకపోచలు, చేతిలో వో నాలుగేళ్ల నాటిదనిపించే పాతబడినడైరీ, దానిలో నుంచీ వెళ్లుకొస్తున్న రకరకాల కాగితాలు, దుమ్ముకొట్టుకుపోయిన ఖద్దరు చొక్కా, దానిక్రిందుగా సాగిన ముడతలు పడినపాంటు- స్థూలంగా ఇదీ శేషగిరి!

పరిచయం అయిన మరుక్షణం - అతను నా గురించి తనకు సర్వమూ తెలుసునన్న రీతిలో - నా పూర్వగాథ చెప్పసాగేడు. నేను నవ్వి వూరుకున్నాను.

"సాహిత్య సాంస్కృతిక వ్యవహారాల్లో మంచి అనుభవంవుంది శేషగిరికి" అన్నాడు సూరి.

ఆ అనుభవంతాలూకు ముఖ్యపదార్థాల్ని అప్పటికప్పుడు రుచిచూపేడు శేషగిరి.

మద్రాస్‌లో అతను హిందీపండిట్‌గా చేశాడట. జరుక్ శాస్త్రి నావాడు అన్నాడు. మల్లాదివారు నాకు కాఫీ ఇప్పించేవారు అన్నాడు. పింగళీ...శ్రీశ్రీ... పానగల్ పార్క్‌లో నాతోకలిసి సిగరెట్టు పంచుకునేవారు అన్నాడు. శ్రీశ్రీ మొదటిఇల్లు గృహప్రవేశానికి కార్లో పిలిపించారన్నాడు. గోఖలే దగ్గర చిత్రాలు వేశానన్నాడు. గాంధీగారి ప్రసంగాన్ని తర్జుమా చేశానన్నాడు. ఉద్యోగవిజయాలు కంట్రాక్ట్ చేసి, పులిపాటి, మాధవపెద్ది వంటి దిగ్గంతుల్ని రప్పించానన్నాడు, టీవీరాజు గారికి హార్మోనియం వాయించానన్నాడు.

నిజం చెప్పొద్దూ - నేను కొంచెం కంగారు పడ్డాను. వాళ్లందరూ అంటే నాకు గౌరవం, భక్తి. అభిమానిగా, ఆరాధకుడిగా వాళ్లందర్నీ చూసి, మాట్లాడి - వారి వ్యక్తిత్వాలకీ, ప్రతిభావ్యుత్పత్తులకీ మనస్సులోనే నమస్కరించుకునేవాణ్ణి. అలాంటినాకు - వారందరితో ఇంత సాన్నిహిత్యంగల శేషగిరి పరిచయం సంతోషమే అయినా, అతను ఈ విషయాల్ని చెప్పినతీరూ, ధోరణీ ఆశ్చర్యాన్ని కలిగించినై.

ఎనిమిదికావస్తుంటే... నేను సెలవుతీసుకున్నాను. వచ్చేస్తుంటే వెనక్కి పిలిచాడు శేషగిరి. ఆగేను. "అవునూ మీరు సినిమాల కెందుకు రాయకూడదు మాష్టారూ" అన్నాడు.

నవ్వివూరుకున్నాను. మళ్ళీ అదేప్రశ్నని రెట్టించాడు.

"నాకు అలాంటికోరికలేదుసార్, పైగా నా ఉద్యోగం నన్నలాంటి పనులకు ప్రేరేపించేదికాదు" చెప్పాను.

"ఓ కే. ఆ సంగతలా వదిలేయండి" అని చిత్రంగా కళ్ళుచికిలించి, "రండి, కాఫీతాగి పోదాం" అంటూ హోల్లోకి దారితీశాడు.

ముగ్గురమూ కాఫీత్రాగేము.

సూరి బిల్లుచెల్లించాడు. "మళ్ళీ కలుద్దాం" అన్నాడు శేషగిరి. నేను ఇంటిదారిపట్టేను.

ఆ తర్వాత నెలదాకా శేషగిరిని మళ్లీ చూళ్లేదు.

ఆరోజు.....

ఆఫీసులో ఏదోకాన్ఫరెన్స్ జరుగుతోంది. జవాను చీటీతెచ్చి ఇచ్చాడు, "వీరు మిమ్మల్ని అర్జంటుగా చూడాలిట" అని.

నేను కొంచెం ఇరకాటానపడ్డాను. మేనేజర్ అనుమతితీసుకుని బయటికి వచ్చాను.

శేషగిరి సోఫాలోకుర్చుని సిగరెట్ కాలుస్తున్నాడు.

"చెప్పండి" అన్నాను. మనస్సులో తొందరగావుంది నాకు.

తన పక్కగావున్న సంచిలోంచి ఒక పుస్తకాలదొంతర తీశాడు, శేషగిరి. వాటికి పురికొస కట్టివుంది.

"చూడండి రాజుగారూ. ఇవి చాలా అరుదైన పుస్తకాలు. నేను వొకాయన దగ్గర టోకున సేకరించి - మీలాంటి మిత్రులకి వొకరిద్దరికి మాత్రం ఇస్తున్నాను. సూరిగారికి ఇచ్చాను. పదిహేను పుస్తకాలు ఇరవై ఆర్రూపాయలు. అంతే."

"సరే ఇచ్చివెళ్ళండి" అంటూ పర్స్ తీసి డబ్బు ఇచ్చేను. పుస్తకాల్ని జవానుకిచ్చి నా సీట్లో వుంచమన్నాను. కాన్ఫరెన్స్ జరుగుతున్నవైనం చెప్పి శేషగిరి వద్ద సెలవు తీసుకున్నాను.

అతను థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.

.... ఆ రాత్రి,

ఇంట్లో పుస్తకాల్ని చూసేను. అన్నీ 1932-33లో అచ్చయిన పద్యగ్రంథాలూ వ్యాస సంపుటాలూ. గ్రంథకర్తలు ఎవరెవరో హైస్కూల్ ఉపాధ్యాయులు. అప్పట్లో వాటి వెల పావలా, అర్ధరూపాయి వున్నై. మొత్తం కూడితే ఏడ్రూపాయల ఆరణాలు వచ్చింది.

ఆ మర్నాడు.

సూరిచెప్పేడు, "శేషగిరి ఇప్పుడు పాత పుస్తకాల వ్యాపారంచేస్తున్నాడు. మనకిచ్చిన పుస్తకాలన్నీ అతనికి తూకానికొచ్చిన సరుకు" అని.

"పోనీలే... ఏవో కొన్ని పాతపుస్తకాలు దక్కేయి. ఆనాటి రచనావిశేషాలూ, విషయ వైవిధ్యం, ముద్రణ. భాషా, శైలీ-చూడటానికి ఉపయోగపడతయ్.. ఉండనీ" అన్నాన్నేను.

"శేషగిరి బాగా బతికిచెడిన మనిషే. ఇబ్బందుల్లో వున్నాడు. ఎనిమిదిమంది సంతానం. ఇద్దరు పెళ్లాలు అంటే, వొకావిడ ఈయనతో నాటకాల్లో వేషాలేస్తూ ఈయనతోనే స్థిరపడిపోయింది".

సూరిమాటలకి ఆశ్చర్యపోయాను "ఐతే శేషగిరికి వయస్సెంత వుంటుందంటావ్?" అడిగేను.

"ఎంతలేకేం, ఏభైవుంటయ్" అన్నాడు సూరి.

"పోన్లేపాపం, అయితే, ఈ పుస్తకాలు కొని మనమూ ఒక సమిధ వేశామన్నమాట" అన్నాన్నేను.

వో వారంపోయాక కలిశాడు, శేషగిరి.

ఆవేళ ఎండతీవ్రంగావుంది. వడగాలి వీస్తోంది. కనుచీకటి వేళయినా, వాతావరణంలో ఆవిర్లు తగ్గలేదు.

కనిపిస్తూనే... వుసూరుమంటూ, కూల్‌డ్రింక్ షాప్‌వైపు దారితీశాడు, శేషగిరి. నేను అతన్ని అనుసరించాను.

ఐస్‌క్రీమ్‌కి ఆర్డరిచ్చాడు శేషగిరి.

తింటూ కూర్చున్నాం.

"మంచి మిత్రుడొకాయన దొరికాడు మాష్టారూ, ఎంతైనా ఫర్లేదు, గొప్పఆర్ట్‌పిక్చర్ తియ్యమని పోరుతున్నాడు. డైరెక్షన్ మనమే. మొన్న మద్రాస్‌పోయి, ఆఫీస్ తెరిచివచ్చాం. ఆర్టిస్ట్‌ల సెలెక్షన్ మొదలెట్టాలి. స్క్రిప్టు నాదే వుంది. కానీ, దానికి మీ ఐడియాస్‌ని జోడించాలి. న్యాయానికి నేనే ఈవేళ రాత్రికి మీ యింటికి వద్దామనుకుంటున్నాను, మీరే కనిపించారు."

నేను పరధ్యానంగా వున్నట్టు గమనించి అన్నాడు శేషగిరి... "మీరేమీ సందేహించకండి. పేమెంట్‌విషయంలో నేనెంత చెప్తే అంత...మన ప్రొడ్యూసరు. కథ నాదైనా, మీ శ్రమకు బాగాముట్టచెప్పించే బాధ్యతనాది."

నా చేతిమీద తనచేతిని వేసి సుతారంగా కొట్టేడు. నా కళ్లల్లోకి చూస్తూ "ఊ" అనండి అన్నట్టు... తనే, "ఊఁ, అంతేమరి" అన్నాడు. నేను మౌనంగా ఉండిపోయాను. ఆ వెంటనే, శేషగిరి తన దగ్గరున్న కథని చెప్పటం మొదలెట్టాడు. చేతులు తిప్పుతూ, మధ్య మధ్యలో లొట్టలు వేస్తూ, అబ్బా, అమ్మా, "ఇకచూడు... సెంచరీఖాయం" వంటిమాటలు ఉటంకిస్తూ, ఏ పాత్రకు ఏ నటీనటులు సరిపోతారో వాక్రుచ్చుతూ... వివిధ భంగిమల్తో... అర్ధగంటసేపు... చెప్పింది చెప్పకుండా మలుపుల్తో, తీపితలపుల్తో రంగరించి... కథ చెప్పాడు. చివరికి అన్నాడు, "మీరు బాగా ఆలోచించి స్క్రిప్టుమీద కూర్చోండి. నాకు చెప్తే నేనూ వస్తాను, ఎనభై సీన్లలో నరకండి చాలు"

నాకు నవ్వొచ్చింది, ఆయన ధోరణికి. సభ్యతకోసం ఆపుకున్నాను.

"మీకు సహాయం చేయడం నాకు ఇష్టమే అయినా... ఇల ంటి వాటిల్లో అనుభవం లేనివాణ్ణి, నన్నొదిలేయండి" అన్నాను మొహమాటంగా. "అమ్మమ్మ... ఎంతమాట. మీశక్తి నాకు తెలీన్దికాదు రాజుగారూ. మీరు కొంత టచ్ చేస్తేచాలు... నా కథకు బంగారపు తావి అబ్బుతుంది. అదీ నా ఆశ. మీరేం మాట్లాడకండి"

అంటూ లేచాడు.

బిల్లు ఇవ్వబోయి, "అరెరే. చిల్లరలేదు... హండ్రెడ్‌కి"అని జేబులో ఉంచిన చేతిని జేబులోనే ఇరికించుకున్నాడు.

డబ్బు ఇచ్చి బయటికి వచ్చాను. కిళ్లీ కొట్టుదగ్గర విల్స్‌పాకెట్టూ, అగ్గిపెట్టే, కిళ్లీ తీసుకున్నాడు. ...శేషగిరి. అతనేమీ అనకుండానే నేను డబ్బిచ్చాను.

శేషగిరి తీయబోయే సినిమా గురించిన ఆలోచనలతో ఇల్లు చేరుకున్నాను.

మర్నాడు... సూరి కలిసేడు. జరిగింది చెప్పేను.

"నేనూ విన్నాను. ఎవరో ప్రొడ్యూసర్ దొరికాడని మన శాస్త్రిగారికీ చెప్పేట్ట, ఎక్కువమందిని మనవూరి నటీనటుల్ని పరిచయం చేస్తానంటున్నాడట" అన్నాడు సూరి.

రోజులు వారాలై, వారాలు నెలలై... నాలుగు నెలలు గడిచిపోయినై.

సోమవారం....

ఉదయం- తొమ్మిది కావొస్తోంది. నేను స్నానం ముగించి, పేపర్ చూస్తున్నాను. భోజనం చేసి ఆఫీస్‌కు పోవాలి.

శేషగిరి ఊడి పడ్డాడు.

అవతారం మారింది. మనిషి నీట్‌గా ఉన్నాడు. డైరీ స్థానంలో చేతిలోకి ఒక జిప్ బ్యాగ్ వచ్చింది. దాన్నిండా చాలా కాగితాలూ, పుస్తకాలూ ఉన్నై.

ఏదో సేవింగ్స్ కంపెనీకి ఏజెన్సీ తీసుకున్నాట్ట. వ్యాపారం మరీ లాభసాటిగా ఉండటంతో .. చాలా 'బిజీ' అయిపోయాడట. ఆ కారణాన సినిమా వ్యవహారం మానుకున్నాట్ట. చుట్టుపక్కల వూళ్ళు తిరుగుతూ నాలుగు నెలల్లోనే నాలుగు వేల ఆదాయం సాధించాడట. ఆకంపెనీ వివరాలన్నీ చెప్పేడు. నేను సహకరించాలనీ అర్థించాడు. ఆ నెల "టార్గెట్" కాలేదట. అందుకని నా సహాయంకోసం వచ్చానన్నాడు. సూరి కూడా కొంతమొత్తం ఇచ్చాడట. తప్పదన్నాడు. ఐదొందలు తీసుకొని ఏవో రసీదులిచ్చాడు. కొన్ని కరపత్రాలూ ఇచ్చాడు. కొన్ని ఫారాలమీద

సంతకాలు పెట్టించుకుని, కాఫీతాగి వెళ్లిపోయాడు.

భోజనాల దగ్గర శ్రీమతి నానా రకాల మాటలు అనడం మొదలెట్టింది. నాకు నోట్లో నాలుకలేదంది. ఎవరేం చెబితే అది నమ్ముతానంది. లౌక్యం తెలీదంది. చూస్తూ చూస్తూ అనవసరంగా ఐదువందలు శేషగిరికి సమర్పించుకున్నారంది.

"పొదుపుచేస్తే సాధిస్తావేఁవిటే" అని విసుక్కున్నాను.

"ఆఁ.. పొదుపే, మళ్లీ వచ్చేదెంతో" అని నసిగింది.

ఎందుకనోగానీ, ఆఫీసుకు వెళ్తూనే... సూరికి ఫోన్ చేశాను. నే చెప్పింది విన్నాడు, సూరి.

"ఫర్వాలేదులే, నేనూ కట్టాను. చూద్దాం కానీ" అని భరోసా ఇచ్చాడు సూరి.

నాలోనేను కొంతసేపు మల్లాగుల్లాలు పడి ఆ విషయం మర్చిపోయాను.

కార్తీకమాసం...

వనసమారాధనకి మామిడితోటకి వెళ్లాం. ముప్పై కుటుంబాలు.

మధ్యాహ్నం భోజనాలు చేసి పేకాటలో కూర్చున్నాం. లోకాభిరామాయణం విడిపడ్డది. ఎవరో ముల్లుగుచ్చారు. "ఆతను ఏజంటుగా వున్న కంపెనీ బోర్డు తిప్పేసిందట. డబ్బు కట్టినవాళ్లకి ఏఁవీ తిరిగిరాదు" అని.

ఇది విని నేను చాలా రిచ్చపడ్డాను. ఐదొందలకి నువ్వులూ నీళ్ళూ వదలాల్సి వచ్చింది. "నావీ రెండొందలుపోలా" అని తేలిగ్గా అని 'షో' చేశాడు సూరి. ఫస్టరౌండ్ తిరిగింది. అంతే, అందుకని వందదాకా వచ్చింది.

"సగం వచ్చేసిందిలే" అని నవ్వేడు సుబ్బారెడ్డి.

వనభోజనం ఆనందాన్ని ఆ రాత్రి మాయావిద సాధింపూ, ఏడుపూ హరించేసినై.

ముందుగా ఆలోచిస్తే... అప్పట్లో కలిగిన తృప్తి పోతుందేమోనన్నట్లు... అనవసరంగా భార్యమాటలు వినలేదని పశ్చాత్తాపమూ కలిగిందినాకు.

అయినా, అదుసుత్రొక్కటం అయ్యే పోయింది, కాలుచూసుకుని విచారించి లాభమేముందిగనుక?... కిమిన్నాస్తిగా ఊరుకున్నాను. నలుగురితోపాటు చావు పెళ్లితో సమానమన్నట్లు నాతో పాటు మా మిత్రబృందంలోని అందరికీ అంతో ఇంతో చేతులు కాలాయని తెలిసి, అదోవిధమైన తృప్తికలిగింది నాకు! మానవబలహీనతకి మంచి ఉదాహరణ యింతకంటే ఏముంది?!

... రాత్రి పదకొండు దాటింది.

కాలింగ్‌బెల్ మ్రోగితే తలుపు తీశాను.

ఎదురుగా శేషగిరి! లోపలికివచ్చికూర్చున్నాడు.

నీరసంగా, దీనంగావున్నాడు మనిషి. అతన్ని చూడగానే చప్పున నా ఐదువందలు గుర్తుకొచ్చినై. వివరాలడుగుదామనిపించింది కానీ, నా ప్రశ్నలూ, సందేహాలూ నా గొంతుకలో ఉండగానే.. అతను పెదవి విప్పేడు.

"నా భార్య చావుబ్రతుకుల్లో వుంది రాజుగారూ. మీరే ఆదుకోవాలి. ఇప్పటికిప్పుడు కర్నూలు తీసికెళ్లమంటున్నారు డాక్టర్లు. ఒక్క మూడొందలు సర్దాలి. ఇవి చేతులు కావు." సజలాలైన కళ్లతో చేతులు పట్టుకున్నాడు శేషగిరి.

నా మనస్సు ఆర్ద్రమైంది. గుటకపడలేదు. "ఏ భార్య" అని అడగబోయి ఆగిపోయాను. ఇంట్లోకి వెళ్ళి మూడొందలు తెచ్చి అతనికిచ్చాను. మధ్యలో మాయావిడ కళ్లతో, చేతుల్తో అడ్డుకున్నదిగానీ, నేను ఆమె అభ్యర్థనని ఖాతరు చేయలేదు.

శేషగిరి నా ఉదారతను ఎంతో పొగిడి నన్ను దేవుణ్ణి చేసి, చివరికి థాంక్స్ చెప్పి, గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయాడు.

ఒకవారం తరువాత... సూరిదగ్గర శేషగిరి ప్రస్తావన తెచ్చాను. అతను తనకేమీ తెలీదన్నాడు. శాస్త్రిగారినడిగితే.. ఏదో నాటక పోటీలు పెడుతున్నానని తన దగ్గర ఓ ఏభైరూపాయల టిక్కెట్లిచ్చి డబ్బుపట్టుకుపోయాడని చెప్పారు.

అసుర సంధ్యవేళ... శేషగిరి ఇల్లు వెతుక్కుంటూ నబీకోట వెళ్ళాను.

త్వరగానే దొరికింది. విచారించాను ఇంట్లో. పదహారేళ్లపిల్ల చెప్పింది, "పదిహేను రోజుల్నుంచీ వూళ్లోలేదు, మా నాన్న" అని. తల్లి జబ్బు గురించి అడిగేను. "మా అమ్మా పిన్నీ... ఇద్దరూ కులాసాగానే వున్నారే" అంటూ ఆశ్చర్యపోయింది.

దొంగకు తేలు కుట్టింది. నాలో నేను నా తెలివితక్కువ తనానికి విచారించి, లోలోపల ఏడ్చుకుని ఊరుకున్నాను. క్రియకీ, కర్తకూ కూడా అజ్ఞానమే కారణం మరి! నన్ను నేను నిందించుకోక చేసేదేముంది.

నాకుపట్టిన గ్రహణం అనుకోండి, లేదా నన్నుపట్టిన గ్రహం అనుకోండి... అంతటితో విడిచిపోయి ఉంటే ఈ కథకూడా తోకలేని కథే అయ్యుండేది. నేను మొదట్లోనే చెప్పినట్లు ఈ కథ కాగితాలకెక్కేది కాదు.

నిజానికి నాకు నేను లోకువైపోయిన ఇలాంటి సంఘటనలు నా జీవితంలో చాలానే జరిగినై. నా ఖాతాలో తన భార్యకు గుడ్డలు కొనుక్కున్న మిత్రుడూ, నా ఖాతాగల పచారీషాపులో నా పేరు చెప్పి తన పిల్లకి అమూల్ డబ్బాలు తీసుకున్న స్నేహితుడూ..... ఇలా చాలామంది శేషగిరులు నాకు తటస్థపడి ఉండనే ఉన్నారు.... గతంలో.

అయితే... ఈ శేషగిరి ఆ తర్వాత ప్రదర్శించిన వినోదమే నేను మీకు చెప్పాలనుకున్న అసలు కథ.

ఆదివారం...

మధ్యాహ్నం కలత నిద్రలో కునుకు తీస్తున్నాను. మా ఇంటి వీధి గుమ్మం ముందు కోలాహలంగా, హడావిడిగా ఉంది. సవ్వడికీ, కేకలకీ, అరుపులకీ నిద్ర చెదిరింది. లేచి తలుపు తీసి చూశాను.

శేషగిరి! అతని చొక్కా కాలర్‌ను పుచ్చుకుని చెప్పుతో కొట్టేస్తున్నాడు... ఓ నడివయస్సు వ్యక్తి.

నేను ఆశ్చర్యంలో మునిగిపోయాను. ఒకరిద్దరు వాళ్లిద్దర్నీ విడదీయాలని ప్రయత్నిస్తున్నారు. శేషగిరి ప్రతిఘటించడంలేదు. తలవంచుకుని, సిగ్గుతో, బాధతో...

దెబ్బలు తింటున్నాడు. నాకు జాలేసింది. గబగబా వెళ్ళి ఆవ్యక్తిని అడ్డుకున్నాను. పక్కకి తప్పుకుని నిలబడ్డాడు, శేషగిరి. నా కళ్ళల్లోకి ప్రాధేయపూర్వకంగా, కృతజ్ఞతగా చూస్తున్నాడు. అవతలివ్యక్తి మాత్రం రెచ్చిపోతూ, "కక్కరా దొంగనాయాలా, నా రెండొందలు ఇప్పుడు కావాలనాకు. నువ్వేంచేసినా సరే, ఇప్పటికిప్పుడు ఇక్కడికిక్కడ ఇవ్వాల. లేకపోతే ఇవ్వాళ నీ రక్తం కళ్లచూస్తాను" అని మీదమీదకి రాసాగేడు.

శేషగిరి హీనస్వరంతో సంజాయిషీ ఇస్తున్నట్టు చెప్పేడు, నాకు... "మా పెద్దమ్మాయి ఏదోగొడవల్లోపడి నిద్రమాత్రలు మింగి నెత్తిమీదకితెస్తే... బుద్ధి గడ్డితిని ఈయన దగ్గర వడ్డీకి తీసుకున్నాను, రాజుగారూ. నా పరిస్థితి నాకే దయనీయంగా ఉంది. ఏం చేస్తాను చెప్పండి. రోజులు బాగాలేవు. పట్టిందల్లా మట్టయిపోతోంది"

అవతలివ్యక్తి బూతులు అందుకున్నాడు. నన్ను కూడా పక్కకి నెట్టి శేషగిరి మీదకి లంఘించాడు.

నేను ఆవేశంగా అతన్ని ఒక్కతోపు త్రోశాను వెనక్కి. నోరుమూసుకొని అవతలికి నిలబడమన్నాను. ఏదో తెగింపూ, తెగువా వచ్చేసినై నాకు. లోపలికి వెళ్ళి రెండొందలు తెచ్చి ఆ వ్యక్తిమోహాన్న కొట్టేను. అదృష్టవశాత్తూ మాయావిడ మ్యాట్నీకి వెళ్ళింది!

మూగచూపులు చూస్తూ చేతులు జోడించాడు శేషగిరి. నేనే వారించాను. తనకష్టాల్ని నివేదించుకుని ఆ తర్వాత కొద్దిసేపటికి వెళ్ళిపోయాడు, శేషగిరి.

ఈ ఆదివారం సంఘటనంతా ఒక ప్రహసనమనీ, దానిలో రెండవ పాత్రధారి... శేషగిరి బావమరిది అనీ, ఈ నాటకానికి రచయిత, దర్శకుడు శేషగిరేనని తెలియదానికి... మరో ఇరవైనాల్గుగంటలకంటే ఎక్కువ పట్టలేదు.

నా గతితప్పిన కరుణ గుర్తుకొచ్చి, నా మనస్సు విలవిల్లాడిపోయింది.

కథకి తోకదొరికింది. శేషగిరిజిత్తులూ, వాటితోపాటు లయవిన్యాసం చేస్తున్న అతని తోకా... ఊళ్లో నలుగురూ దొరకపుచ్చుకున్నారు. అతను బిచాణా ఎత్తేశాడు.

చిన్నప్పట్నుంచీ నాకు గారడీ అంటే ఇష్టం. బహుశా నాలోని ఆ బలహీనతని గమనించే తెలివి ఒక్క శేషగిరిలాంటివాళ్లకే ఉంది కాబోలు!

ఆ రాత్రి... తనకు పండక్కి కొత్తచీర కావాలని గారంపోయింది, నా శ్రీమతి. డబ్బులేదనీ, చాలా ఇబ్బందిగా ఉందనీ, మొన్నటికి రెండొందలు అన్యాయంగా పోయాయనీ... ఏదో వాపోవబోయి.... చటుక్కున నాలుక కరుచుకుని, నోరుమూసుకున్నాను!

నా మౌనానికి తనభాష్యం తాను చెప్పుకుంది.... శ్రీమతి!!

***

(ఆగష్టు - 1984, స్వాతి మాసపత్రిక)